# మీకు తెలుసా?

రోజూ ఆ ఇంటి ముందునించే మా ఇంటికి వెళ్లాలి నేను. అది పెద్ద కాంపౌండులో పగలే రాత్రి అనిపించేటంత దుబ్బుగా పెరిగిన రకరకాల చెట్ల మధ్య పెరిగే బంగ్లా నిజానికి. పెద్ద స్టీలుగేటూ దానికి తగిలించి "కుక్కలున్నాయి జాగ్రత్త" అనే అందమైన ప్లేటూ (తెల్లటి కుక్కల బొమ్మలు గీసినది) ఉన్నాయి ఆ కాంపౌండ్ వాల్ కి.

ఆ సాయంత్రం సుబ్బులుగాడూ, నేనూ కాళ్లకి రెండు టన్నుల బరువున్నట్లుగా ఏడుస్తూ నడుస్తున్నాం. ఆ ఇంటి ముందరగా. సుబ్బులు భారతదేశంలో ఒక మెజారిటీ వర్గమైన నిరుద్యోగ వర్గపు చిరకాల సభ్యుడు. ఈ ఊళ్ళో "ఫలానా ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్" లో ఓ తగు మాత్రం ఉద్యోగానికి అప్లయి చేశాడు. ఎల్లుండి ఇంటర్వ్యూట. ఓ పాత గుడ్డసంచీ పట్టుకుని మా ఆఫీసుకి నేరుగా వచ్చేశాడు రైలు దిగి. ప్రాణస్నేహితుడు నాకు. అయినా నిరుద్యోగ పిశాచ గ్రస్తుడు కావటాన వాణ్ణి చూడగానే నాకు కడుపులో దేవినట్లైంది. నేనుచూస్తే ఎలాగో ఓ ఉద్యోగం లాంటిది చేస్తున్నాగాని పలుకుబడి సున్నా.

"ఇది నా ముప్పైమూడో ఇంటర్వ్యూరా. హె.. హె..." అంటూ "కిలకిలా" నవ్వబోయిన వాడి గొంతులో పక్క వాద్యాల సంగీతంలా వంద ఏడుపులు పలికాయి. సరే, నాకు మాట రానేలేదు. కాళ్ళకున్న బరువు మరో క్వింటాల్ పెరిగినట్టయి ఆగిపోయాను. ఇద్దరం రోడ్డు పక్కనున్న లాంతరు స్తంభం దిమ్మ మీద కూర్చున్నాం. సిగరెట్ పెట్టి తీసి వాడికొకటిచ్చి నేనొకటి తీసుకున్నాను. ఇద్దరం పొగ పీలుస్తున్నాం. సాయంత్రం ఆరవుతోంది. మా ఎదురుగా ఉన్న ఆ బంగ్లాలోంచి పియానో నోట్స్ గాలి తరగల్లా వచ్చి మమ్మల్ని తాకాయి. ఎవరో బాగానే వాయిస్తున్నారు. పియానో సరిగా వాయించడం చాలా కష్టం. స్త్రీ ఉద్యోగం చేస్తూ, సంసారానికి ఏ లోపమూ లేకుండా చూస్తున్నదానికంటే కష్టం; ఎందుకంటే పియానో రెండు చేతుల్తోనూ వాయించాలి.

పొగ వదులుతూ "ఎవరిదిరా ఆ ఇల్లు" అన్నాడు సుబ్బులు...చెప్పాను.

డాక్టర్ భగవాన్ గారి ఇల్లు అది. వాళ్ళ ముత్తాత ఎవరో ఇంగ్లీషు దొర దగ్గర కొన్నది. ఇపుడా ఇల్లూ, తోటా, పది లక్షలేనా చేస్తుంది. భగవాన్ గారి భార్య శివరాణి గారు. ఆవిడ రాష్ట్రంలోనే ఒక పెద్ద సోషలైట్. మినిష్టర్ల నించీ ప్రజాకవుల వరకూ అందరికీ ఆ ఇల్లు ఒక కేంద్రం. శివరాణిగారు "బహు పతివ్రత" అనీ, అందుకే డాక్టర్ గారు ఇంటికి చుట్టపు చూపుగా తప్ప

రాకుండా ఆస్పత్రిలోనే ఓ రూంలో నివసిస్తారనీ చెప్పుకుంటారు. శివరాణీగారు ఈ ఊళ్ళో ఒక కింగ్ మేకర్. అనేక రకాల లావాదేవీల్లో ఆవిడ సూత్రధారిణి. దొంగ సారావాళ్ళూ, స్మగ్లర్లూ, స్కాచ్ తాగే ప్రజాకవులూ, మనుషుల రక్తం మీద బతికే రాజకీయ నాయకులూ, పోలీసు ఆఫీసర్లు, నటులూ, ఎందరెందరి మధ్య ఏ డీల్స్ జరిగినా శివరాణిగారి ఆధ్వర్యం లోనే జరగాలి. అంత గొప్పది ఆవిడ. శివరాణీగారు అందంగా వుండరు. కాని కనిపిస్తారు. కత్తిరించిన జుట్టు, చేతుల్లేని జాకట్టు, లేటెస్టు డిజైన్ చీరలూ, విపరీతమైన దర్పం, సినిమా స్టార్ల స్థాయి మేకప్. ఆవిడని చూడబుల్‌గానే ఉంచుతాయి.

నేనిదంతా వివరించాను శివరాణిగారి ఇంట్లోంచి వచ్చే సంగీతం వింటూ. సంగీతం మరింత ఉషారెక్కి కేబరే డాన్స్‌ని గుర్తు చేస్తోంది. "ఒరే ఆనంద్, ఆవిణ్ణి అడిగితే నాకు వుద్యోగం ఇప్పిస్తుందిరా. వెళ్దాం రారా."అన్నాడు సుబ్బులు. మనుషులకి కష్టాల వల్ల జ్ఞానం వస్తుందనుకోవడం మూర్ఖత్వం. కష్టాలతో మెదడు మొద్దుబారుతుంది. వీడికి అదే జరిగింది. సుబ్బులు మొహంలోకి జాలిగా చూశాను. "ఒరి పిచ్చి తండ్రీ. ఆకుక్కల బోర్డు చూశావా? ఆ ఇంట్లో మనం అడుగు పెడితే శివరాణీగారే కాదు ఆవిడ కుక్కలు కూడా మన మొహం చూడవు. కుక్కలు మన్ని కరిచినా, విధిలేక ఇలాంటి వాళ్ళని కరవాల్సి వచ్చిందన్నట్లు తలవంచుకు వెళ్ళిపోతాయి కరిచేసి. మనం కనిపిస్తాంరా, ఆవిడ కళ్ళకి?" అన్నాను. కాని ఏటిలో మునిగి పోతున్న వాడు నీటి బుడగనో డింగీ అనుకుని పట్టుకునేలా సుబ్బులు తన కొత్త ఐడియాని వదల్లేదు.

"అది కాదురా. ఆడవాళ్ళవి మెత్తని గుండెలు. గుండెలు కరిగేలా నేను నా బాధలు చెప్తే కరుణించదా, కావలిస్తే కాళ్ళమీద పడిపోతాను."

"ఆవిడకి తన కాళ్ళ మీద మనుషులు పడి పడి మొహం మొత్తి వుంటుంది. అంచేత కాళ్ళమీద నువ్వు పడాలనే ముచ్చటేమీ వుండదు. ఆ ఆశ పెట్టుకోకు."

"ట్రై చేస్తే ఏం పోయిందిరా. ముందే నీళ్ళు జల్లకపోతే కాస్త ఓపికపట్టి నాకు హెల్ప్ చేయకూడదూ?" నిష్ఠూరంగా అన్నాడు.

"ఏం చెయ్యమంటావ్ నన్ను? అమ్మా, మా వాడు కన్నీళ్ళతో మీ పాదాలకు అభిషేకం చేయబోతున్నాడు. తడిసి జలుబు చేయకుండా ఈ నైలాన్ సాక్స్ తొడుక్కోండి" అని తొడగనా? లాభం వుండదురా" అని నేనంటుంటే పొడుగాటి నల్లని అమెరికన్ కారొకటి బంగ్లా ముందు ఆగి చిరాగ్గా హారన్ కొట్టసాగింది. మేం కారునే కన్నార్పకుండా చూడసాగాం. కారుమీద చిన్న అక్షరాలతో మరో ఊరికి చెందిన పెద్ద పరిశ్రమ పేరు కారు లైట్ల వెలుగులో గర్వంగా మెరుస్తోంది. ఆపరిశ్రమ పేరు చూడగానే దాని ఓనర్‌నే ఎదురుగా చూసినట్లు ఠక్‌మని లేచి నిలబడ్డాడు సుబ్బులు. "ఒరే ఆనందూ,, ఆ కంపెనీ జనరల్ మేనేజర్ మేజర్ సింహాద్రి-రేపు మా ఇంటర్వ్యూ బోర్డులో ఉంటాడాయన. ఈ కారులో ఆయనే వచ్చాడేమో. వెళ్ళి ఆయన్నే అడిగేద్దాం" అంటూ ముందుకి నడిచాడు నారెక్క పట్టి లాగుతూ. నేను రెండడుగులు వేశాను.

ఇంతలో బంగ్లాగేటు కీచుమంటూ తెరుచుకుంది. ఆ పొడుగుకారు మెత్తగా గుడగుడమంటూ లోపలున్న తోట చీకట్లోకి జారిపోయింది. గేటు తెరిచిన పనిమనిషి వెంట వచ్చిన విదేశీ సంకర

జాతి కుక్కలు మమ్మల్ని చూసి కోపంగా రెండుసార్లు మొరిగి కారు వెనకాలే లోపలికి పరుగెత్తాయి. ఆ గేటు తీసినవాడు అక్కడే నిలబడ్డాడు. ఏం చేయాలో తోచని స్థితిలో పడి పోయిన మేమూ అతగాణ్ణి చూస్తూ ఉండిపోయాం.

అతను మా వైపు రాసాగాడు. చెప్పద్దూ, మాకు భయం వేసింది. మేం ఏదొంగలమో అనుకుని తన్నడానికి వస్తున్నాడేమోనని. "సార్! మీ దగ్గర ఉంటే ఓ సిగరెట్ పడేయండి" అన్నాడు అతను మా దగ్గిరకొచ్చి. బతుకు జీవుడా అని రెండు సిగరెట్లు అతని కిచ్చి చాలా మర్యాదగా అగ్గిపుల్ల గీసి అతని సిగరెట్ వెలిగించాను. పేదవాడి గురించి వ్యాసం వ్రాయమంటే ఓ పెద్దింటి అమ్మడు "పేదవాని కారు డ్రైవర్ పేదవాడు; పేదవాని తోటమాలి కూడా పేద వాడు; పేదవాని వంటమనిషీ, వాచ్‌మెన్ కూడా పాపం పేదవాళ్ళే" అని వ్రాసిందని అందరూ పెద్ద జోక్‌గా నవ్వుకుంటాం. కాని తప్పేముంది? గొప్పవాడి ఇంటి నౌకరు కూడా మాకు గొప్ప వాడు కాలేదూ ఇప్పుడు?

"థేంక్స్ సార్. ఈరోజు వీధిలో అడుగుపెట్టడం వీలుకాలేదంటే నమ్మండి. గేట్‌కీపర్, వంటవాడూ ఎగకొట్టేశారు. నేనే వంట పనిలో దిగాల్సి వచ్చింది. సిగరెట్ పడందే నాకు ప్రాణం లేవదు సార్" అన్నాడు రెండు దమ్ములు పీల్చి.

"అయితే ఇంద" అని ఓ నిండు సిగరెట్ పెట్టె తీసి అతని చేతుల్లో పెట్టాను. "ఎందుకు సార్! కొనుక్కోడానికి వీల్లేక కాని-" అని జేబులో పెట్టుకున్నాడు. "మీగేం చేస్తుంటార్ సార్...ఉద్యోగమా బిజినెస్సా?" మా సుబ్బులు గాడి పూర్తిపేరూ, నా ఉద్యోగం; చెప్పాను. వాళ్ళ పెత్తండ్రి వియ్యంకుడి తోడల్లుడి బామ్మరిద్దీ అలాంటి ఉద్యోగమేట. ఇద్దరం చాలా సంతోషించాం. ఈ సాన్నిహిత్యానికి. "ఈ మేష్టారేం చేస్తారు సార్".

"బి. యే. బి. ఎల్ చదివాడు. ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు."

"మీ అమ్మగారు ఉద్యోగాలు ఇప్పిస్తారని తెలిసి-" సుబ్బులు ట్రై చేస్తున్న ఉద్యోగం సంగతి చెప్పాను.

నూకరాజు ఫెళఫెళా నవ్వాడు. "ఇలాంటి ఉద్యోగాలు ఆవిడకో లెఖ్ఖా సార్. మీరు చదు వుకున్నోళ్ళు. మీకు తెలీదని కాదు. పులుల్ని తుపాకీతో చంపే దొర ఉడతల్ని పట్టుకోమంటే పట్టుకుంటాడా? పట్టుకోడు. పులి లెవె లేమిటి! ఉడత లెవ లేమిటి? సిగరెట్లు కాల్చే వోళ్ళు బీడి తాగుతారా? సిగరెట్టే కాలుస్తారు. నేనంతే. మా గోవిందుగాడి బీడీలు వంటింట్లో ఓ మూల ఉన్నాయి. సిగరెట్ లేక నాలుక పీక్కుపోతున్నా కాసిని మంచి నీళ్ళు తాగి ఊరుకున్నాగాని అవి కాల్చేనా? నోనో! ఇలాంటి చిన్న ఉద్యోగాలు అమ్మగారు వేయించరు. ఎంత అవమానం! ఆవిడ స్టేటస్ పడిపోదూ? బేంక్‌లో ఆఫీసర్లనండి, కంపెనీ మేనేజర్ ఉద్యోగాలనండి, పార్ల మెంట్‌కి పార్టీ టిక్కెట్టనండి...అలాంటివి అమ్మగారు టేకప్ చేస్తారు. అలాగే సిమ్మెంట్ కోటా లూ, సినీమాల్లో వాటాలూ, ఇన్‌కమ్‌టాక్స్ రాయితీలూ, మర్డర్ ఎరేంజ్‌మెంట్స్-మీఫ్రెండ్ గారి ఉద్యోగం లాంటిది ఆ యమ్మకి చెడ్డ చిరాకు-"

అతని వాక్ప్రవాహానికి ఉక్కిరి బిక్కిరైపోయాం. చిన్న ఉద్యోగానికి బదులు పెద్ద ఆఫీసర్ వుద్యోగానికి ట్రై చెయ్యకపోడం మా పాపం అన్నట్టు కృంగిపోయాం.

"లాభం లేదుసార్. మీరిప్పుడు ట్రై చేసే ఉద్యోగం వేయించేవాళ్ళు-అణాకానీ సరుకు-ఈవూళ్ళో చానామందున్నారు. రాయుడుగారు తెల్సుగా. ఎయిర్ లైన్స్ పక్కనుండే పచ్చమేడ. ఆయన పది నిమిషాల్లో మీ పని చేయిస్తాడు మేష్టారూ. రేట్లు మాత్రం ఖచ్చితం..."అని ఆగి, మా ఇద్దరికీ నా సిగరెట్లే చెరోటీ ఇచ్చి తనొకటి వెలిగించుకుని కాస్సేపు ఆలోచించి, "అయిదువేల అయిదు వందలు సార్. అంతే అయిదూ అయిదు... మంచి నిఖార్సయిన మనిషి. పనికాపోతే మీ డబ్బు మీకిచ్చేస్తాడు. నూటికి తొంభైపాళ్లు ష్యూరనుకోండి! అక్కడి కెళ్ళండి సార్, నా మాటవిని!" నేను ఏడుపు ఆపుకుంటూ, "ఇందాకా అమెరికన్ కారులో వచ్చిందెవరు?" అన్నాను.

"ఆయనే సార్, మేజర్ సింహాద్రి. అమ్మో, లక్షాధికారి. బోలెడు ఫ్యాక్టరీలూ, బిజినెస్‌లూ ఉన్నాయి. ఇక్కడ "ఫలానా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్"కి ఓ డైరక్టరు. అదే మేష్టారూ, మీరు ట్రై చేస్తున్న కంపెనీయే."

"ఆయనకి చెప్పుకుంటే-"

"ఆయన వినడు సార్. అమ్మగారు చెబితే వింటాడు. ఆవిడగారు చెప్పరుగా. మినిష్టర్లు ట్రై చెయ్యడం చూశాను. అప్పుడే ఇవ్వలేదు. మీరూ మీరూ అడిగితే ఇస్తాడా! ఆ లెవలోళ్ళకి మనం మనం లెఖ్ఖా సార్. కళ్ళు మూసుకుని నాలుగు పేర్లు టిక్కు పెడతాడు. అది వాళ్ళదృష్టం. అంతేకాని అమ్మగారు తప్ప ఎవరు చెప్పినా చెప్పించినా వినడు" అని సందేశం ఇచ్చి "నేను ఇంట్లో కెళ్ళాలి సార్. చంటోడికి జొరంగా వుంది చూసొస్తానని అరగంట పర్మిషన్ మీదొచ్చాను. మీతోటే సరిపోయింది. వెళ్తాసార్" అని వెళ్ళిపోబోయాడు.

సుబ్బులు అక్కడే నేలమీద చతికిల పడి ఏడుపు మొదలెట్టాడు. ఇందాకా మేజర్ సింహాద్రి కారుని చూసేసరికి ఏదో వెర్రి ఆశ పుట్టినట్లుంది వాడికి, ఇప్పుడు ఆశాభంగం కావడంతో ఏడుపొచ్చేసింది.

"ఏడవనీ, వెర్రి సన్నాసిని. కొంత స్ట్రైస్ రిలీజవుతుంది" అని లోపల అనుకుని పైకి మాత్రం "నూకరాజుగారూ! మా ఫ్రెండ్‌ని చూస్తున్నారుగా. వీడిగురించి మీ అమ్మగారికి కాస్త చెప్పండి. మీరు అయిదారేళ్ళనించీ ఇక్కడ వుంటున్న చనువుమీద ఆవిడ కనికరించి మేజర్ గారికి చెప్తారేమో" అని, అతనేదో చెప్పబోతుంటే నా జేబులోంచి ఆ రోజే అప్పుచేసిన నూరు లోంచి ఓ ఏభై రూపాయలు తీసి నూకరాజు చేతిలో పెట్టాను.

నూకరాజు వెర్రి నవ్వొకటి నవ్వాడు. "సార్, లాభంలేదు సార్. పై పెచ్చు అమ్మగారికి కోపం వచ్చినా రావచ్చు. నా ఉద్యోగం కూడా పోతుందేమో అప్పుడు." అన్నాడు నోటు జేబులో పెట్టుకోకుండా. మరో పది నిమిషాలు ఆగిపోయి ఏదో వేదాంతం చెప్పాడు. నోటు నా జేబులో కుక్కబోయాడు. నేను నేర్పుగా తప్పించుకొని సుబ్బులిని రెక్కపట్టి లేవదీసి వెళ్ళిపోతూ "థేంక్స్ నూకరాజుగారూ. వీడికి వుద్యోగం వస్తే మీ మేలు మరవం. నీట ముంచినా, పాలముంచినా మీదే భారం" అని టాటా చెప్పాను. నూకరాజు మమ్మల్ని చూస్తూ ఉండిపోయాడు.

* * *

ఇంటర్వ్యూ అయ్యాకా వెళ్ళిపోతూ సుబ్బులు "ఒరే, ఇదే నా ఆఖరి చూపేమో! నేను ఇంక బ్రతకలేనురా" అన్నాడు. వీడికి పోటీగా నాలుగు వందల ఏభై మంది వచ్చారుట. ఉన్న ఖాళీలు నాలుగూ. అంత మంది జనాన్ని చూసేసరికి ఉన్న మతి కాస్తాపోయి గొంతు పెగలక "ఏడిసినట్టు" చేశాడుట ఇంటర్వ్యూలో. నాకూ ఆశ లేదు... ఏమైనా తెలుస్తుందేమోనని నూక రాజుని కలవబోయి కొంచెంలో (నానా) జాతి కుక్కల కాట్లు తప్పించుకున్నాం మేం.

* * *

పది రోజుల తర్వాత సుబ్బులు ఎగురుకుంటూ మా ఇంటికి వచ్చి నన్ను కావలించుకుని గిరగిరా తిప్పేశాడు. "ఆనంద్, సానంద్, బ్రహ్మానంద్, ప్రేమానంద్, రామానంద్, రోమానంద్, కామానంద్, స్నేహానంద్, లంచానంద్, అని దండకంలా చదువుతూ ఉద్యోగం రాక పిచ్చెత్తిందేమో అనుకున్నాను. "ఒచ్చిందిరా! నూకరాజూ జిందాబాద్. జై శివరాణి మాతా!" అన్నాడు. ఆగి, ఆయాసంతో ఒగరుస్తూ జేబులోంచి ఆర్డర్ తీసి నాముఖం మీదకి విసిరేశాడు. మా గొడవకి కంగారుపడి చుట్టూ మూగిన నాభార్యా పిల్లలూ ఆ కాగితాన్ని చదివేసి "భలే భలే" అని చప్పట్లు కొట్టారు. ఆ రోజు మాకు పండగే అయింది. సుబ్బులికి ముందే రెండు ఇంక్రిమెంట్లు కూడా యిచ్చారు.

* * *

నేనిచ్చిన ఏభై రూపాయల తీపితో నూకరాజు అమ్మగారికి నిజంగానే చెప్పాడనుకుందాం. ఆవిడ ఎందుకంత శ్రద్ధ తీసుకుని మేజర్ సింహాద్రికి చెప్పింది? అదీ నా సందేహం. నూకరాజూ, ఇతరులూ చెప్పిన మాటల ప్రకారం ఆవిడకి చిన్న చిన్న సమస్యలు మనస్సుకి పట్టవు. అంతా వేలూ, లక్షల వ్యవహారాలు, మినిష్టర్లకీ మినిష్టర్లకీ మధ్య తగవులూ ఇవేకదా ఆవిడ చేసే రాచ కార్యాలు!! ఈ నూకరాజు మాటకి అంత విలువ ఎలా ఇచ్చింది?

నాకు సైకో ఎనాలిసిస్ కొంచెం తెలిసిన మిత్రుడొకడు పెంటారావు-ఉన్నాడు. ఓ రోజు నేనూ, సుబ్బులూ, అతనూ హొటల్లో కాఫీ తాగుతుండగా ఈ విషయం ప్రస్తావించాను. వెంటనే పెంటారావు-అంతదాకా కాఫీ తాగ్గానే దండు బజారికి అర్జంటుగా వెళ్ళాల్సిన పని వుంటుదన్న వాడు అది పూర్తిగా విస్మరించి-అందుకున్నాడు. "ఫ్రాయిడ్ అదే కదండీ చెప్పా డు. అదే సెక్స్! అన్నింటికీ కీలకం అదే. నూకరాజుకీ ఆవిడకీ రహస్య సంబంధం ఉండి ఉం టుంది. పది మంది తన అంతస్తువాళ్ళతో ఆవిడకి ఎఫైర్స్ ఉండచ్చు. కాని సెక్స్ డర్టీ అన్న కాంప్లెక్సు ఆవిడకి వుండి, -నూకరాజుతోనే బాగా ఎంజాయ్ చేస్తుందన్న మాట. అతను మీనియల్ కదా-"

సుబ్బులు ఆవేశంతో ఊగిపోతూ ఠక్కున లేచి నిలబడ్డాడు, "శివరాణీ గారిని ఏమైనా అంటే చంపేస్తాను!" అంటూ. నేను వాణ్ణి సముదాయించి కాఫీ తాగించేసరికి తాతలు దిగొ చ్చారు. వాడు సణుగుతూనే ఉన్నాడు. ఏదేదో కొన్ని మాటలే నాకర్థం అయ్యాయి. "శ్రీ శ్రీ కాకేం తెలుసు సైకో ఎనాలిసిస్" అని ఉండాలి. పదండి మద్రాసు వెళ్ళి శ్రీ శ్రీనే అడు గుదాం.... ఆవిడకి రహస్య సంబంధాలు ఎవరితోనూ లేవు. మధురవాణి లాగా కేవలం ఎవర్నో

కాపాడ్డానికి ఓ ముద్దు ఇస్తుందేమో. అదీ అనుమానమే...మెంటల్ బాలెన్స్ పోయినవాడు ఎనలిస్టు దగ్గరకు వెళ్తే, బాంక్ బేలన్స్ కూడా పోతుంది. పూర్తి క్షవరం అన్నమాట...హోహోహో..." ఇలా గొణుగు తున్నాడు ఒణుకుతున్న చేతుల్తో కాఫీతాగుతూ.

పెంటారావు సుబ్బులిని తీక్షణంగా చూసి "మీ డిజార్డర్ నాకర్థం అయింది. అది మదర్ ఫిక్సేషన్. తాపీగా ఎనలైజ్ చెయ్యాలి మిమ్మల్ని. హొటల్లో కుదరదు" అంటుంటే సుబ్బులు లేచి నిలబడి పెంటారావు మొహం మీద ఉమ్మేసి "చావు" అని అరిచి హొటల్లోంచి ఠీవిగా నడిచి వెళ్ళిపోయాడు.

పెంటారావు మంచి బలమైన మనిషి. సుబ్బులిని చావగొట్టేస్తాడు అని భయంవేసి, తెలివిగా "మదర్ ఫిక్సేషనా? చెప్పారు కాదూ!" అని పెంటారావుని ఉబ్బేశాను. పెంటారావు మరో కాఫీ ఇప్పించమని నాకు చెప్పి, సిగరెట్ వెలిగించి, మరో గంట సైకో ఎనాలిసిస్ గురించి నాకు చెప్పాడు. నేను చాలా శ్రద్ధగా విన్నాను. బిల్లు చెల్లించి బయటకు వస్తుంటే పెంటారావు నవ్వుతూ, "సుబ్బులు గురించి మీరేం వర్రీ అవకండి. రెండు మూడు సెషన్స్‌లో అతన్ని క్యూర్ చేస్తా. ఎటొచ్చీ అప్పుడు అతన్ని కదలకుండా, పారిపోకుండా ఉంచే బాధ్యత మీది" అన్నాడు.

* * *

రెండు నెలలు గడిచాయి. సుబ్బులు ఉద్యోగ రహస్యం నన్ను వేధించటం మానలేదు. "శివరాణిగారు ఎందుకు నూకరాజు మాట విన్నారు?" ఆవిడకి పేదలంటే దయకాదు సరి కదా ద్వేషం అని అందరికీ తెలుసు. అంచేత సుబ్బులు దీనకథ నూకరాజు చెప్పగా విని కరిగి పోయే అవకాశంలేదు.

ఈలోగా సుబ్బులుకు సుబ్బలక్ష్మితో పెళ్ళికూడా జరిగిపోయింది. నేనూ, సుబ్బులూ అద్దె ఇళ్ళవేట మొదలెట్టాం-మారెండు కుటుంబాలకీ సరిపోయే ఇంటి కోసం.

ఓ సాయంత్రం అలా ఇంటి వేటలో అడ్డమైన పేటలూ తిరుగుతుండగా ఓ పాక ఇంటి గుమ్మంలో చంటాడిని ఎత్తుకుని కనపడ్డాడు నూకరాజు. అతను మమ్మల్ని పోల్చుకోలేదు కాని మేం ఎలా మర్చిపోతాం? "నమస్కారమండీ" అంటూ దగ్గిర కెళ్ళాం. ఎవరో అర్థంకాక సందేహిస్తూ నమస్కారం చేశాడతను.

"మేం గుర్తున్నామా? ఇతని ఉద్యోగం గురించి మేం, రెండు నెల్లు దాటింది లెండి, మీ అమ్మగారి గేటు ముందర మీతో మాట్లాడాం"- గుర్తు రాలేదూ! "ఏభై రూపాయి లిచ్చాం" ఠక్కున గుర్తుపట్టాడు. కంగారు పడిపోయాడు- ఆ ఏభై అడగటానికి వచ్చామనుకుని!

"దేవుడి సాక్షిగా సార్. ఈ చంటాడి మీద ఒట్టు. ఆ ఏభై య్యీ అమ్మగారికే ఇచ్చాను సార్. ఆవిడెందుకో విరగబడి నవ్వారు. అంత చిన్న మొత్తం ఇచ్చేనని నవ్వి వుంటారు సార్. నిజం సార్. అందులో కానీ కూడా నేను తీసుకోలేదు. నేను అమ్మగారు మంచి మూడ్‌లో వున్నారని గ్రహించి మీరిచ్చిన మరుసటి రోజునే ఆ నోటు ఆవిడ చేతిలో పెట్టి మేష్టారిపేరూ అదీ చెప్పాను సార్. ఏ వుద్యోగం కావాలో కూడా సరిగ్గా చెప్పాను. అమ్మగారికి ఎంతసేపో

నవ్వాగలేదు. ఆనోటు జాకట్లో దాచేసుకుని మేజర్ సింహాద్రి తోటలో తిరుగుతుంటే ఆమే పిలిచి మళ్ళీ సుబ్బులు గారి పేరు, కావల్సిన ఉద్యోగమూ చెప్పారు సార్. ఇద్దరూ ఇంగ్లీషులో మాట్లాడారు- నాకేమీ తెలీలేదు. పైగా అక్కడుంటే బాగోదని చెప్పి కిచెన్‌లోకి వెళ్ళిపోయాను...నన్ను నమ్మండి సార్. నాకు దొంగబుద్ధి లేదండి. ఈ బిడ్డ ప్రాణాలుతోడు. నేను పైసా కూడా దాచుకోకుండా ఆ అమ్మకే ఇచ్చాను. లక్షలు లక్షలుతో బంతాటలాడే లక్ష్మీదేవి ఆ యమ్మ. ఏభై రాపాయలిస్తే పైసంత కూడా ఆనదు. ఆ వుద్యోగం అందుకే రాలేదు...."

నేను సుబ్బులు వేపు సాభిప్రాయంగా చూసి, "జేబులోంచి తియ్యరా" అన్నాను నవ్వాపుకుంటూ. నూకరాజు ఇంకా కంగారుపడి పోయాడు, సుబ్బులు ఏ చాకోబాకో తీస్తాడని. సుబ్బులు పర్స్ తీశాడు. నేను రెండు వేళ్ళు చూపించాను. ఇరవై రూపాయిల నోటు తీసి చంటాడి బుల్లి చేతిలో పెట్టాడు సుబ్బులు. వాడు దాన్ని కాదనకుండా తీసుకుని ఆప్యాయంగా తినసాగాడు.

"నూకరాజుగారూ, మీదయవల్ల, మీ సిఫార్సువల్ల ఆ ఉద్యోగం సుబ్బులుకు వచ్చింది. మీ మేలు మర్చిపోలేం. ఇన్నాళ్లూ మిమ్మల్ని కలవాలని ఎంత ట్రై చేసినా దొరకలేదు మీరు."

నూకరాజు మొహం నూకంత వున్నది కాస్తా చాటంత అయ్యింది. "నేనేం చేశాను సార్? కూచోండి. కాఫీ రప్పిస్తాను" అని మర్యాదల్తో మమ్మల్ని ముంచెత్తేశాడు. శివరాణీగారు అమెరికా వెళ్లార్ట, అంచేత అతనికి సెలవులు.,

అక్కడ, వీధిలోనే, మురిక్కాలవ ప్రక్కన కూర్చుని; చాలాసేపు చర్చించాం ఈ విషయం. ఏభై రూపాయలు శివరాణీ గారికి గడ్డిపరకతో సమానం. అలాంటప్పుడు ఎందుకు సుబ్బులు కేసు సింహాద్రి గారికి రికమెండ్ చేసింది?

ఎంత చర్చించినా ఏమీ తేలలేదు. సుబ్బులు ప్రత్యర్థుల్లో పదహారుమంది రికమెండేషన్ లెటర్లతో వచ్చి శివరాణీ గారిని కలిశారుట. ఉన్నవి నాలుగే ఖాళీలు. కనుక సుబ్బులుకు రావడం ఒక మిరకిల్‌గానే భావించాం.

ఏమీ తేలలేదు. పెంటారావు చెప్పిన సెక్స్ ఏంగిల్లో సత్యం ఉందేమోనని భ్రమ కూడా కలిగింది మాకు.

* * *

పది రోజుల తర్వాత,

పేపర్లో చూశాం. శివరాణీగారు న్యూయార్క్‌లో ఓ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో రెండు జతల మేజోళ్ళు (విలువ మూడు డాలర్లు) దొంగతనం చేసి దొరికి పోయారనీ పోలీసులు పట్టుకుని కోర్టుకి తీసుకెళ్తే అక్కడ జుల్మానా విధించారనీనూ. "క్లెప్టోమానియా" అని ఆ జబ్బు పేరు. "దొంగతనం కొందరు కేవలం "థ్రిల్" కోసం చేస్తారు. అవసరం కోసం కాదు" అని పెంటారావు వివరణ కూడా యిచ్చాడు.

అనుకోకుండా ఆశించకుండా నూకరాజు మా ఏభై రూపాయలూ చేతిలో పెట్టేసరికి

అలాంటి "థ్రిల్" వచ్చిందేమో శివరాణీ గారికి. ఆ మురిపెంతో వెంటనే మేజర్ సింహాద్రికి కేసు రికమెండ్ చేసిందేమో. అంతకంటే ఏమనుకుంటాం!! ఇంకేదైనా కారణం ఉందేమో నాకు తెలీదు. మీకు తెలుసా?

**(కలువబాల; పక్షపత్రిక, 1-10-1988)**

★